ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు


TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | మంగళవారం | 18.08.2026 | సంపుటి : 2 | సంచిక : 46 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు


## విద్య, వైద్య రంగాలకు

# అత్యంత ప్రాధాన్యం

### ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

విద్యా వ్యవస్థలో మార్పుల అవసరం ఉంది

గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు

వచ్చే ఏడాదికల్లా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం

కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ

సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

హైదరాబాద్, ఆగస్ట్ 17 : ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని

-మిగతా 2 లో..



## తెలంగాణలో సర్ జాబితా విడుదల

78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ

2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు

సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు

ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ

అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల

హైదరాబాద్, ఆగస్ట్ 17 : తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు

-మిగతా 2 లో..



## 22ఎ భూములపై ఆందోళన వద్దు

అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది

అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం

నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం

టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి

ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం

రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరణ

హైదరాబాద్, ఆగస్ట్ 17 : ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని

-మిగతా 2 లో..

NATIONAL TESTING AGENCY (NTA)

## ఎన్‌టీఏలో 50 మందికి ఉద్వాసన

పరీక్షల నిర్వహణ వ్యవస్థలో దిద్దుబాటు చర్యలు

అధికారులతో మంత్రి ప్రల్హాద్ సమీక్ష

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మకమైన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతం, లక్షలాది మంది విద్యార్థుల ఆందోళనలతో కేంద్ర విద్యా శాఖలో కదలిక మొదలైంది. కీలకమైన పరీక్షల నిర్వహణ బాధ్యతలు చూసుకునే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లో ముఖ్యమైన అధికారులు సహా మొత్తంగా ఇప్పటిదాకా 50 మంది సిబ్బందిని తొలగించినట్లు ఎన్‌టీఏ సోమవారం వెల్లడించింది. ఉన్నతావిద్యా విభాగ అధికారులతో నూతన విద్యామంత్రి ప్రల్హాద్ జోషి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించిన సందర్భంగా ఎన్‌టీఏ

-మిగతా 2 లో..



## కళ్యాణ, షాదీముబారక్ కొనసాగుతుంది

గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు

అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి

దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం

ధర్నాలు చేసే వారు పథకలంటే తప్పిదాలపై మాట్లాడాలి

మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

హైదరాబాద్, ఆగస్ట్ 17 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మీ పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి

-మిగతా 2 లో..

## డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా

సీలింగ్ చట్టం ఎత్తేశాక మళ్లీ ఎందుకొచ్చింది

సీఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు

పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం

ప్రభుత్వ తీరుపై హరీష్ రావు ఆగ్రహం



రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు.

హైదరాబాద్, ఆగస్ట్ 17 : తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

2 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం

ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 17 :** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల

-మిగతా 2 లో..





## రాష్ట్ర వ్యాప్తంగా మండలస్థాయి ప్రజావాణి

565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో నిర్వహణ

మొత్తం 5,410 వినతుల స్వీకరణ ..10,753 మంది అధికారుల హాజరు

జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి

ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఆగస్ట్ 17 : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతమైంది. ప్రజల సమస్యలను వారి మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని

-మిగతా 2 లో..

## యువతిని హత్య చేసిన ప్రియుడు

గర్భం దాల్చడంతో తప్పించుకునే యత్నం

దుండగుడి కోసం పోలీసులు గాలింపు



# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం



## 22ఎ భూములపై ఆందోళన వద్దు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి పీయూష్ గోయెల్ లు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్సులో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల పక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




## ఎన్‌టీఏలో 50 మందికి ఉద్వాసన

(మొదటిపేజీ తరువాయి)

ఈ వివరాలను బహిర్గతంచేసింది. నీట్--యూజీలో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్ట్ పేపర్లలో తప్పులు దొర్లాయని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో సెపటంబర్ 9 నుంచి మళ్లీ రీ--ఎగ్జామ్ నిర్వహిస్తామని ప్రకటన వెలువడిన మరుసటి రోజే ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్, ఇతర సీనియర్ ఉన్నతాధికారులతో మంత్రి ప్రల్హాద్ సమావేశమై పరీక్షల నిర్వహణలో సంస్కరణలపై కీలక ఆదేశాలిచ్చారు. ఎన్‌టీఏలో ఇకపై కొత్తగా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, సీఐఎస్ఓ, టెస్టింగ్ సెక్యూరిటీ జనరల్‌మేనేజర్, ఆర్ అండ్ డీ, సైకోమెట్రిక్స్‌లో జనరల్ మేనేజర్ తదితర కీలక పదవుల్లోకి అత్యంత వృత్తి నైపుణ్యమున్న వ్యక్తులను నియమించాలని నిర్ణయించారు. ఈ పదవుల్లోకి నియామక ప్రక్రియను ఆరంభించినట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ వివరాలను విద్యాశాఖ తర్వాత తన 'ఎక్స్'ఖాతాలో పోస్ట్‌చేసింది. మూడు సబ్జెక్ట్ పరీక్ష ప్రశ్నాపత్రాల్లో చాలా తప్పులు దొర్లడం, అవే ప్రశ్నలు పదేపదే అడగడంతో విమర్శలు వెల్లువెత్తడంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా 50 మందిని ఎన్‌టీఏ తొలగించిందని వార్తలొచ్చాయి.

## విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం (కొనసాగింపు)



చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం. సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు. టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి. 2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి



పోతున్నారు. కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట. అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా.. ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి.. నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా. వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

**ఏకీకృ'త వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తీసుకొచ్చాం**

**ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ స్పష్టీకరణ**

**హైదరాబాద్,ఆగస్ట్17 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను, ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తీసుకున్న నూతన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి అంశంలోనూ చట్టం ప్రకారమే పాలన సాగిస్తూ, ప్రజలకు సంపూర్ణ జవాబుదారీతనంతో సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఆహార పదార్థాలు, నిత్యవసర ఔషధాల నాణ్యతను, భద్రతను పర్యవేక్షించేందుకు ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ను అమలులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నూతన అథారిటీ ద్వారా కఠిన ప్రమాణాలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. దీని ద్వారా మార్కెట్లో లభించే ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించడం, నకిలీ , ప్రమాదకర మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు పెరిగి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా పౌరులకు సురక్షితమైన ఆహారం, సమర్థవంతమైన మందులు అందుబాటులోకి వచ్చి, ప్రజారోగ్యానికి సంపూర్ణ భద్రత చేకూరుతుంది. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మందులు అందించడమే లక్ష్యంగా పనిచేసే సేవలను ఉపయోగించుకుంటూ, ఆరోగ్యవంతమైన, సురక్షితమైన తెలంగాణ నిర్మాణంలో రాష్ట్ర పౌరులందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

(మొదటిపేజీ తరువాయి)

పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ÷ల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. ? స్వయంగా ముఖ్యమ ంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి..? కమిషన్ల కోసమేనా..? అసలు ఈ ప్రాపర్టీలను అందులో ఎవరు పెట్టారు? కమిషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు..? దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7, 2023 నుంచి భూములను ప్రొహిబిషన్ లిస్ట్ లో పెట్టిన వివరాలు ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి. అప్పటిలోగా ఈ ఆస్తులన్నింటినీ దాని పరిధి నుంచి మినహాయించాలన్నారు.

## కళ్యాణ, షాదీముబారక్ కొనసాగుతుంది

(మొదటిపేజీ తరువాయి)




ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభిం చింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు.. ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.



## రాష్ట్ర వ్యాప్తంగా మండలస్థాయి ప్రజావాణి

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లయిందని ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు. మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు (పిటిషన్లు) అందాయి. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతులను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజావాణి కోసం అధికారులు శాఖ వారిగా డెస్క్ లు, హెల్ప్ డెస్క్ ను, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజలు సమర్పించిన వినతులను నేరుగా స్వీకరించడంతో పాటు, ఆయా సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ జిల్లా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 704 వినతులు స్వీకరించబడ్డాయి. అలాగే, ఒక మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ జిల్లా ముందంజలో ఉంది. కరీంనగర్ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 47 వినతులు అందాయి. మండల స్థాయిలోనే ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించడం ద్వారా సమస్యల పరిష్కార పక్రియను ప్రజలకు మరింత చేరువ చేయడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా లేదా రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానిక స్థాయిలోనే సంబంధిత అధికారులకు తమ సమస్యలను వివరించే అవకాశం మండల స్థాయి ప్రజావాణి ద్వారా లభించింది. ÷-రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి, అధికారుల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతులు సమర్పించగా, అధికారులు కూడా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. కొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడి, 5,410 వినతులు స్వీకరించబడ్డాయి. ప్రజలు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

# ఆలోచన.. ఆచరణ కేసీఆర్‌ది

**ప్రచారం..ఫలితం మాత్రం కాంగ్రెస్‌ది**
**సనత్‌నగర్ టిమ్స్‌పై హరీశ్ రావు విమర్శలు**



**హైదరాబాద్, ఆగస్ట్ 17 :** ఆలోచన, ఆచరణ కేసీఆర్‌ది అయితే.. ప్రచారం కాంగ్రెస్‌ది అన్నట్లుగా ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇచ్చినట్లే.. కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సనత్‌నగర్‌లోని టిమ్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంపై ఆయన స్పందించారు. డెట్లు, డెడ్‌లైన్లు మార్చుకుంటూ పోయి, చివరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న దవాఖానలో కూడా పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడం శోచనీయమన్నారు. వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మించిన హాస్పిటల్‌ను కేవలం ఓపీ సేవలకే పరిమితం చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేరు మార్చినంత సులువుగా హాస్పిటల్ కట్టిన చరిత్ర మార్చలేవన్నారు. హైదరాబాద్‌కు మూడు వైపులా మూడు టిమ్స్ హాస్పిటల్స్ (అల్వాల్, సనత్‌నగర్, ఎల్బీనగర్) ఏర్పాటు చేసి, పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నది కేసీఆర్ ఆలోచన. కరోనా తర్వాత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, వందేళ్ల ముందు చూపుతో కేసీఆర్ ⸗ఎఓ⸗లకు రూపకల్పన చేశారన్నారు. 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు మూడు ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ దవాఖానలకు శంకుస్థాపన చేసి చరిత్ర సృష్టించారు. ప్రణాళిక కేసీఆర్‌ది.. శంకుస్థాపన కేసీఆర్‌ది.. నిధులు విడుదల చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఒక్కో ఆసుపత్రి వెయ్యి పడకల సామర్థ్యంతో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో నిర్మించే మూడింటి నిర్మాణానికి రూ.2,679 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో శరవేగంగా సాగిన పనులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నత్తనడకన సాగాయి. సకాలంలో పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మూడున్నరేళ్ల సుదీర్ఘ కాలంలో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించకుండా, కేవలం ప్రచారం కోసం నేడు ⸗ఎఓ⸗ సనత్‌నగర్‌ను ప్రారంభిస్తున్నారు. కనీసం హాస్పిటల్‌కు నీటి సరఫరా కూడా కల్పించలేదు అంటే పేదల వైద్యం పట్ల వీరికి ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం అవుతుంది. కేసీఆర్ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆలోచిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేద నుంచి ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరవండి. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో మొదలు పెట్టిన టిమ్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఉగ్ర నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేశాం

**కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా**



**న్యూఢిల్లీ :** ఐఎస్ఐ మద్దతు కలిగిన షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనే ఉగ్రవాద గ్రూప్‌ను నాశనం చేసినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే.. ఆ గ్రూప్‌నకు చెందిన 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు చేసినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తద్వారా దాని విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు తెలిపారు. ఉగ్రవాదం విషయంలో భారత్ కఠిన వైఖరికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. "షహజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు అనేక ఉగ్ర కార్యకలాపాల్లో ప్రమేయం ఉంది. ఈ క్రమంలోనే భారత భద్రతా దళాలు ఇటీవల 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో సమన్వయంతో కూడిన ఆపరేషన్‌లు నిర్వహించాయి. 200 మందికిపైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసి.. భట్టీ నెట్‌వర్క్‌ను నాశనం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ గ్రూప్ నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆయుధ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టళ్లు, తూటాలు, గూఢచర్యం కోసం ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలు సహా పెద్దఎత్తున సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి" అని అమిత్ షా తెలిపారు. ఇదిలా ఉండగా.. గత నెలలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) రాష్ట్రవ్యాప్తంగా ఓ భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై 112 మందిని అధికారులు ప్రశ్నించారు. గ్యాంగ్‌స్టర్ భట్టీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా దేశ వ్యతిరేక కార్యకలాపాల వైపు యువతను ఆకర్షించడానికి, వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏటీఎస్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వ వివరాల ప్రకారం.. షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది. పోలీస్, రక్షణ, మతపరమైన ప్రదేశాలను రెక్కీ చేసేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక మధ్యవర్తులకు డబ్బు చెల్లిస్తోంది. భట్టీపై ఎన్ఐఏ పలు కేసులను దర్యాప్తు చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అతడిని పరారీలో ఉన్న నిందితుడిగా పేర్కొంటూ ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసింది.

## ఉప్పల్ పరిధిలో మెడికో ఆత్మహత్య

**యువకుడి మృతితో కటుఉంబంలో విషాదం**

**హైదరాబాద్, ఆగస్ట్ 17 :** హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటు చేసుకుంది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న కె.భరద్వాజ్ రెడ్డి(18) అనే మెడికో నిర్మాణంలో ఉన్న ఒక భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెడికో బలవన్మరణానికి గురికావడంతో ఆయన కుటుంబంలో, ఉస్మానియా మెడికల్ కాలేజీలో తీవ్ర శోక ఛాయలు అలముకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. భరద్వాజ్ రెడ్డి తెల్లవారుజామున 3:20 గంటల ప్రాంతం నుంచి కనిపించకుండా పోయాడు. అతను ఇంట్లో కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, స్నేహితులు , బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా అతని ఆచూకీ లభించక పోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు. ఉదయం 8:30 గంటల సమయంలో స్థానికులు డయల్-100కు సమాచారం అందించడంతో ఉప్పల్ పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవనం కింద తీవ్ర గాయాలతో పడి ఉన్న భరద్వాజ్ రెడ్డి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భరద్వాజ్ రెడ్డి ఆత్మహత్యకు గల స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, చదువుల ఒత్తిడి లేదా ఇతర వ్యక్తిగత కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

## రిటైర్‌మెంట్ డబ్బులపై భార్యాభర్తల గొడవ

**భర్తను రోకలిబండతో కొట్టి చంపిన భార్య**

**సిద్దిపేట, ఆగస్ట్ 17 :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. రిటైర్మెంట్ డబ్బుల కోసం భర్తను భార్య రోకలిబండతో కొట్టి హతమార్చడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే..స్థానిక హనుమాన్ నగర్‌లో చెందిన వెంకటేశం- రాజమణి దంపతులు నివసిస్తున్నారు. వెంకటేశం ఆసిఫాబాద్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. రాజమణి ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నది. అయితే ఈ నెలలో వెంకటేశం పదవీ విరమణ చేయాల్సి ఉండగా, రిటైర్మెంట్ డబ్బులు, ఆస్తి విషయంలో దంపతులు గొడవపడ్డారు. ఈ గొడవ పెద్దదిగా మారడంతో ఆగ్రహించిన రాజమణి భర్తను రోకలిబండతో కొట్టి దారుణంగా హతమార్చింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాజమణిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

**హైదరాబాద్,ఆగస్ట్17 :** హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ శ్రీ సాయిరామ్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. 29 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రేగు మహేశ్ బలవన్మ రణానికి పాల్పడ్డాడు. బేగంపేటలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న మహేశ్.. కొన్ని రోజులుగా ముభావంగా ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మహేశ్ కుటుంబ సభ్యులు సొంతూరుకు వెళ్లారు. దీంతో మహేశ్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు, చెల్లిని మిస్ అవుతున్నానంటూ తన చెల్లికి మెసేజ్ పంపించాడు. ఆ మెసేజ్‌పై అనుమానం వచ్చిన చెల్లి.. సమీప బంధువు గిరిబాబుకు సమాచారం అందించి ఇంటికి వెళ్లి చూడాలని కోరింది. గిరిబాబు మహేశ్ ఇంటికి వెళ్లి పరిశీలించగా.. పడక గదిలో ఉరివేసుకున్న స్థితిలో మహేశ్ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహేశ్ బలవన్మరణానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత, కుటుంబ లేదా ఉద్యోగ సంబంధిత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

## కళ్యాణలక్ష్మిని అటకెక్కించే యత్నం

- ఇచ్చిన హామీలపై నోరుమెదపని ప్రభుత్వం
- మండిపడ్డ మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి

**నిజామాబాద్,ఆగస్ట్17 :** కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేక పోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్‌పై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమం తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. ఎన్నికల వేళ మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, పింఛన్లను రూ.2000 నుంచి రూ.4 వేలకు పెంచుతామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేకపోయిందని మండిపడ్డారు. వ్యవసాయంపై ఆధారపడిన గిరిజనులు, సాధారణ రైతులకు రేవంత్ సర్కార్ తీరని అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. రూ.2లక్షల రుణమాఫీ సగం మంది రైతులకు కూడా అందలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరంతరాయంగా అందిన రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని చెప్పి ఉన్న రూ. 10వేలను కూడా సక్రమంగా ఇవ్వకుండా ఎగ్గొట్టి రైతులను ఆగం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు ప్రతిరోజూ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఫోన్ చేయగానే పొలాల వద్దకే ఎరువులు చేరే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో యాప్‌ల పేరుతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. యూరియా, ఎరువుల కోసం అన్నదాతలు రోడ్లపై నిలబడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన నిర్వహణ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు.

## ఇక మండలస్థాయిలోనే ప్రజావాణి ఫిర్యాదులు

**గోవిందరావుపేటలో ప్రారంభించిన సీతక్క**

**ములుగు,ఆగస్ట్17 :** ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. గతంలో ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి సోమవారం ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇకపై గోవిందరావుపేట మండల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను స్వీకరించి, పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి సీతక్క సూచించారు. ఎమ్మార్వో సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్‌లు ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్, వ్యవసాయ అధికారి జితేందర్, మండల విద్యాధికారి దివాకర్, మార్కెట్ చైర్మన్ కళ్యాణి, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, గోవిందరావుపేట మండల సహకార సంఘం చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, పస్రా సర్పంచ్ సుమలతతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## యువతిని హత్య చేసిన ప్రియుడు

- గర్భం దాల్చడంతో తప్పించుకునే యత్నం
- దుండగుడి కోసం పోలీసులు గాలింపు

**హైదరాబాద్,ఆగస్ట్17 :** హైదరాబాద్‌లోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి దారుణ హత్యకు గురైంది. ప్రియురాలిని ప్రియుడు హత్య చేసినట్లు తెలుస్తోంది. ప్రియురాలిపై అనుమానమే ఈ హత్యకు కారణమని బాలాపూర్ పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందగానే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మృతురాలిని బిహార్‌కు చెందిన యువతిగా గుర్తించారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో మృతు రాలు పనిచేస్తోంది. మృతురాలికి ప్రేమ పేరుతో బాలాపూర్‌కు చెందిన అహ్మద్ దగ్గరయ్యాడు. ఇటీవల యువతి గర్భం దాల్చింది. ఈ విషయాన్ని అహ్మద్‌కు మృతురాలు చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఆమె గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని అతడిని బలవంతం చేసింది. దీంతో ప్రియురాలిని అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడు ప్లాన్ చేశాడు. తల్లిదండ్రులతో కలిసి యువతిని అహ్మద్ హత్య చేసినట్లు సమాచారం. నిన్న (ఆదివారం) రాత్రి మృతదేహాన్ని గోనే సంచిలో తరలిస్తుండగా స్థానికులు అనుమానించారు. వెంటనే పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా అహ్మద్‌ను పోలీసులు పట్టుకున్నారు. అహ్మద్‌తో పాటు అతని తల్లిదండ్రులను కూడా అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ప్రస్తుతం ఉస్మానియా మార్చురీలో యువతి మృతదేహాన్ని ఉంచారు.

## దృష్టి మళ్లించి బంగారు ఆభరణాల చోరీ

- దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టు
- ఆరుగురు నిందితుల అరెస్ట్.. భారీగా ఆభరణాలు స్వాధీనం

**హైదరాబాద్,ఆగస్ట్17 :** హైదరాబాద్ నగరంలో గత కొంత కాలంగా అమాయకుల దృష్టి మళ్లించి బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టును లంగర్‌హౌస్ పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి భారీగా బంగారు ఆభరణాలు, నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు అమాయకుల దృష్టిని మళ్లించి విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను అపహరిస్తున్నారు. వరుసగా జరుగుతున్న చోరీలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీటీవీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, నిందితుల కదలికలను గుర్తించారు. ఆధారాలను సేకరించిన అనంతరం ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సయ్యద్ అసద్, ఒమర్ ఖాన్, సయ్యద్ మొయిన్, అజర్ హుస్సేన్, మహ్మద్ ఇబ్రహీం, సయ్యద్ అబ్దుల్ మజీద్ ఉన్నారు. అరెస్టైన నిందితుల నుంచి మొత్తం 13.5 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నాలుగు బంగారు గాజులు, మూడు బంగారు గొలుసులు, ఒక లాకెట్, మూడు ఉంగరాలు ఉన్నాయి. వీటితో పాటు రూ.7.40 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. చోరీలకు ఉపయోగించినట్లు అనుమానిస్తున్న ఆటో, ఒక ద్విచక్ర వాహనం, ఆరు సెల్‌ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుల్లో కొందరిపై గతంలోనే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో షీటర్ కేసులు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది

## పరిశ్రమలతో విద్యార్థుల కనెక్ట్ చేసే యత్నం

**జాబ్ పోర్టల్ ప్రారంభించిన మంత్రి వివేక్**



**మెదక్, ఆగస్ట్ 17 :** దేశంలోనే మొదటిసారిగా పరిశ్రమలను విద్యార్థులను జాబ్ పోర్టల్ కనెక్ట్ చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని పారిశ్రామిక ప్రాంతంలో జాబ్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి పరిశ్రమలు ఉన్నాయని.. స్కిల్డ్ మ్యాన్ పవర్ అవసరం ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం, పరిశ్రమల యజమానులు కలిసి చేస్తున్న మంచి ప్రయత్నం ఇది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో, దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలకు కూడా ఉద్యోగులను, స్కిల్డ్ లేబర్‌ను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ పైనే దృష్టి సారించకుండా... ఇంకా చాలా రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగరేణి ప్రాంతం మందమర్రిలో జర్మన్ నేర్పిస్తున్నామని.. వారిలో బీ2 లెవల్ వచ్చిందన్నారు.

## 16 ఏళ్ల వయసులో లక్ష్మణన్ సీఏ పూర్తి

**భారతీయ టీనేజర్ గిన్నిస్ రికార్డు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్17 :** పదహారేళ్ల వయసులో టీనేజర్లు తాము ఏ రంగాన్ని ఎంచుకోవాలో తెలియక మల్లగుల్లాలు పడుతుంటారు. కానీ ఓ భారతీయ టీనేజర్ మాత్రం తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవడమే కాకుండా అందులో గిన్నిస్ రికార్డు కూడా సృష్టించాడు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న లక్ష్మణన్ మేయప్పన్ అత్యంత పిన్నవయస్కుడైన సీఏగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తాజాగా చోటు సంపాదించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడికీ అరుదైన గుర్తింపు లభించింది. ప్రస్తుతం మేయప్పన్ సెంచర్గ ÷నాన్షియల్ అనే సంస్థలో సీనియర్గ ÷నాన్షియల్ రీసెర్చ్ ఎనలిస్టుగా ఉన్నాడు. అతడి అసాధారణ ప్రజ్ఞ గురించి కంపెనీ స్వయంగా ప్రకటించింది. కొవిడ్ సమయంలో అకౌంటింగ్‌పై మేయప్పన్‌కు మక్కువ ఏర్పడింది. స్వయంగా సీఏ అయిన అతడి తల్లి అకౌంటింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను తనయుడికి పరిచయం చేయడంతో ఆసక్తి ఏర్పడింది. దీంతో, తాను ఏసీసీఏ పరీక్షలు పాసై సీఏ కావాలని నిర్ణయించుకున్నాడు. 10వ తరగతి పరీక్షల తరువాత ఏడాది పాటు కష్టపడి 2021లో ఏసీసీఏ (అసోసియేషన్ ఆఫ్ చా÷-టర్గ÷డ్ సర్టి÷డ్ అకౌంటెంట్స్) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. కేవలం 16 ఏళ్ల 141 రోజులు చిరు ప్రాయంలోనే చాడ్ అకౌంటెంట్‌గా మారాడు. తనకు గిన్సిస్ రికార్డుల్లో చోటు దక్కడంపై మేయప్పన్ హర్షం వ్యక్తం చేశాడు. 'ఇది నాకెంతో విలువైనది. చదువు అనేది నేనెప్పుడు ఒక రేసులా భావించలేదు. ఆర్థికరంగాన్ని అర్థం చేసుకునేందుకే ప్రాధాన్యం ఇచ్చాను. అన్ని కాలాలకు అనువైన నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టిపెట్టాను. ఆసక్తితో ఏదైనా నేర్చుకుంటే ఫలితాలు అర్థవంతంగా ఉంటాయి' అని అన్నాడు. భారత్‌లో సీఏ పరీక్షలకు హాజరయ్యేందుకు కనీసం 12వ తరగతి పాసై ఉండాల్సిన విషయం తెలిసిందే. అయితే, బ్రిటన్‌కు చెందిన అసోసియేషన్ ఆఫ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) పరీక్షకు హాజరయ్యేందుకు కనీస విద్యార్హత 10వ తరగతే. ఏసీసీఏకు మొత్తం 180 దేశాల్లో గుర్తింపు ఉంది.

## గోదావరిలోకి దూకి ఏఈ కుటుంబం ఆత్మహత్య

**రాజమహేంద్రవరం, ఆగస్ట్ 17 :** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. నగరంలోని రోడ్డు కమ్ రైలు వంతెన పైనుంచి ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పిఠాపురానికి చెందిన ఏఈ కుటుంబం గోదావరిలోకి దూకింది. ఏఈ నూకరాజు, ఆయన భార్య, కుమార్తె, మనవడు నీటిలోకి దూకారు. మనవడు ప్రాణాలతో బయటపడగా.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మిగతా వారి కోసం పోలీసులు, అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. పిఠాపురంలో పంచాయతీరాజ్ ఏఈగా నూకరాజు పనిచేస్తున్నారు. ఈ ఘటనకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నదిలోకి దూకేముందు నూకరాజు మరణ వాంగ్మూలం రాసి స్నేహితులు, అధికారుల గ్రూప్‌లో పోస్టు చేశారు. కాకినాడ రైఫిల్ షూటింగ్ ఆర్గనైజర్ షేక్ సాధిక్ ఖాన్ వేధింపుల కారణంగానే తమ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు నూకరాజు సూసైడ్ లెటర్‌లో పేర్కొన్నారు. తన అల్లుడు ఈ ఏడాది జులైలో మరణించిన తర్వాత కుమార్తెను షేక్ సాధిక్ ఖాన్ వేధిస్తున్నాడని వెల్లడించారు. ఆ వ్యక్తి కారణంగా తన కుమార్తెకు, మనవడికి ప్రాణహాని ఉందని.. ఈ కారణంతోనే తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తెలిపారు. కాకినాడ నాగమల్లి తోట జంక్షన్ వద్ద ఏఈ కుటుంబం నివాసం ఉంటోంది. నిన్న కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి కారులో నూకరాజు కుటుంబం బయలుదేరింది. కొవ్వూరు వంతెన వద్ద డ్రైవర్‌ను దించి నూకరాజు కుటుంబం కారులో వెళ్లింది. రోడ్ కమ్ రైలు బ్రిడ్జిపై కారు ఆపి వంతెనపై నుంచి నూకరాజు కుటుంబం దూకింది. నీటిలో కొట్టుకువస్తున్న నూకరాజు మనవడు పదేళ్ల రియాన్ష్ కార్తికేయను జాలర్లు కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. గల్లంతైన నూకరాజు(61), భార్య మీనా(59), కుమార్తె సౌజన్య(34) కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## వేములవాడ ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

**వేములవాడ, ఆగస్ట్ 17 :** వేములవాడ రాజన్న ఆలయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు సీఐలతోపాటు, ఒక తహసీల్దార్, అధికారులతో కూడిన పదిమంది బృందం మూడు బృందాలుగా ఏర్పడి ఆరు గంటలుగా సోదాలు చేస్తున్నారు. ప్రధానంగా ఆరోపణలు వచ్చిన విచారణ కార్యాలయం, గదుల నిర్వహణ, లీజులు, అన్నదానం, గోదాం, లడ్డు ప్రసాదం, పీఆర్‌వో కార్యాలయం తదితర విభాగాల్లో రికార్డులను పరిశీలిస్తున్నారు. లోతైన విచారణ జరిపేందుకు పలు రికార్డులను స్వాధీనం కూడా చేసుకున్నట్లు తెలిసింది. ఒక్కసారిగా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించడంతో ఆలయ అధికారులు ఉలిక్కిపడ్డారు. అయితే రాత్రి వరకు తనిఖీలు నిర్వహించే అవకాశం ఉండగా ఏదైనా విభాగం మిగిలితే మరుసటి రోజు కూడా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

# సోలార్ పవర్‌లో స్వయం సమృద్ధి సాధించాలి!



**దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడడం మానుకోవాలని ప్రధాని మోడీ ఎర్రకోట్ నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపచేసేదిగా ఉంది. అయితే దేశాన్ని స్వయం సమృద్ధిగా నిలపాల్సిన బాధ్యత పాలకులదే. ముఖ్యంగా ఇంధన, ఆహార రంగాల్లో మనం మరింత బలం కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ తన ఇంధన అసవరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడు తోంది. 88.5 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఇలా అన్నింటికి గల్ఫ్, రష్యా, అమెరికా వంటి దేశాలే దిక్కు. అంతర్జాతీయ పరిణామాలకు భారత ఇంధన భద్రత ఒడిదొడు కులకు లోనవుతోంది. ఇటీవల హార్ముజ్ జలసంధి, ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్ లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఎక్కువ దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి.**

ఒక్క యుద్ధం వస్తే ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతాం. అందువల్ల సహజ వనరులను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. విదేశాల నుంచి అదేపనిగా అవసరం ఉన్నా లేకున్నా దిగుమతలును చేసుకోవడం వల్ల దేశీయంగా ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి. ముఖ్యంగా ఉప్పులు, పప్పులు, నూనెలపై ఆంక్షలు విధించుకోవాలి. దేశీయంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం తప్పనిసరి చేయాలి. ఇకపోతే గ్యాస్, పెట్ర తదితర ఉత్పత్తులపైనా అన్వేషణ సాగాలి. మన సముద్ర భాగాల్లోనే గ్యాస్ లేదా పెట్రోలియం నిల్వలు వెలుగులోకి వస్తే భారతదేశానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రధాని మోడీ కూడా సముద్ర మథనం గురించి చెప్పారు. ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ.. సముద్ర మంథన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. భారత జలాల్లో సముద్ర అడుగు భాగాల్లో ఇంధన వనరుల కోసం అన్వేషన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వెల్లడించారు.

భారత్ తన ఇంధన అవసరాల్లో మెజారిటీ దిగుమతులపై ఆధారపడుతోంది. అయితే, గతంలో భారత్‌లో ఆఫ్‌షోర్ అన్వేషణకు సంబంధించిన ప్రాంతాల్లో దాదాపు 99 శాతం ప్రాంతాన్ని గతంలో 'నో–గో' జోన్‌లుగా ప్రకటించినట్లు, ఇప్పుడు వాటిలో చాలా ప్రాంతాలను అన్వేషణ కోసం తెరిచినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల గ్యాస్, పెట్రోలియం వంటి ఇంధనాన్ని గుర్తించే పక్రియ మరింత వేగవంతం కానుంది. భారత్ ఇంధన నిల్వల్ని అన్వేషించేందుకు 'సముద్ర మంథన్' అనే నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ఎ÷–లోరేషన్ స్కీమ్ ప్రకటించింది. భారతదేశ సముద్ర తీర ప్రాంతాల్లోని బేసిన్లలో చమురు, సహజ వాయువు నిల్వలను గుర్తించి భవిష్యత్తులో ఉత్పత్తి పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి 2030–31 ఆర్థిక సంవత్సరం వరకు రూ.84,084 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సముద్ర అడుగుభాగంలోని భౌగోళిక నిర్మాణాలను గుర్తించేందుకు సిస్మిక్ సర్వేలు, డీప్ సీ, అల్ట్రా డీప్ వాటర్ డ్రిల్లింగ్,సైంటిఫిక్ డ్రిల్లింగ్, సాధారణ ఆఫ్‌షోర్ మౌలిక వసతులు, చమురు–గ్యాస్ తయారీ వంటివి ఉంటాయి. ఈ పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ నిల్వలు దేశానికి సమకూర్చవచ్చని, దేశీయ ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ ప్రకారం భారత్‌కు తొమ్మిది ఆఫ్‌షోర్ బేసిన్లు ఉన్నాయి. ఇవి మొత్తం సుమారు 17.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం నో–గో ఏరియా ప్రాంతాలను 13.67 లక్షల చదరపు కిలోమీటర్ల నుంచి 24,832 చదరపు కిలోమీటర్లకు తగ్గించారు. దీని ద్వారా భారత్‌కు చెందిన 23.6 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజి)లో సుమారు 99 శాతం ప్రాంతం అన్వేషణకు అందుబాటులోకి వచ్చింది. ఈ ఏరియాల్లో అన్వేషణ పెరుగుతుంది.

అన్వేషణ పెరిగినంత మాత్రాన ఖచ్చితంగా గ్యాస్, పెట్రోలియం ఉంటుదని హామీ ఇవ్వదు. డీప్–సీ ఎక్స్‌ప్లోరేషన్ చాలా ఖరీదైనది, సాంకేతికంగా క్లిష్టమైనది, ఫలితాలు అనిశ్చితంగా ఉండే పక్రియ. అందుకే మెరుగైన భౌగోళిక డేటా, మరిన్ని డ్రిల్లింగ్ కార్యకలాపాలు, కొత్త మౌలిక వసతుల ద్వారా అన్వేషణ నుంచి ఉత్పత్తి దశకు చేరే అవకాశాలను 'సముద్ర మథన్' పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భారత ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో బయో ఇంధనాలపైనా ప్రయత్నాలు సాగాలి. పరిశోధనలు చేపట్టాల్సి ఉంది. సోలార్ పవర్ పరిశోధనలు విస్తృతం కావాలి. దీనిలో విజయం సాధిస్తే ఇంధన కొరతను అధిగమించవచ్చు. ఈ దిశగా పరిశోధనలు పెరగాలి. సోలార్ పవర్‌ను చౌకగా ఉత్పత్తి చేసుకునే దశకు చేరుకోవాలి. అప్పుడే మనకు భవిష్యత్ సులువు కాగలదు. అతిగా విదేవాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. దీంతో ఇంధన అవసరాలతో పాటు, విద్యుత్ సంక్షోభం కూడా తొలగనుంది.

# అమెరికా గగనతలంలో తప్పిన ముప్పు

- ఢీకొనేంతగా దగ్గరకు వెళ్లిన రెండు విమానాలు
- ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంతో ప్రయాణికులు సేఫ్



**న్యూయార్క్, ఆగస్ట్ 17 :** ఆకాశంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలకు పెను ప్రమాదం తప్పింది. రెండింటికి ఒకటే నంబర్ ఉండటంతో అవి ఒకే మార్గంలోకి వచ్చి దాదాపు ఢీకొన్నంత పని అయ్యింది. అయితే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలోని అరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ ప్రాంతంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు గాల్లో ఎదురెదురుగా వచ్చాయి. ఫీనిక్స్ స్కైహార్బర్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అర్ధరాత్రి సమయం లో ఈ ఘటన జరిగింది. అందులో ఒక బోయింగ్ విమానం షికాగో నుంచి వస్తుండగా.. మరో విమానం అప్పుడే ఫీనిక్స్ నుం చి బయల్దేరింది. రెండింటికి ఒకటే నంబర్ ఉండటం (అమెరికన్ 2482), ప్రతికూల వాతావరణంవల్ల షికాగో విమానం ఆలస్యం కావడం రెండు విమానాలు ఒకే లైన్‌లోకి రావడానికి కారణమయ్యాయి. వేర్వేరు మార్గాల్లో వెళ్లే విమానాలకు ఎయిర్‌లైన్స్ ఇలా ఒకే నంబర్ ఇవ్వడం సాధారణమే. అయితే ఒకే కాల్ సైన్ ఉన్న విమానాలు ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఉండటం మాత్రం అరుదుగా జరుగుతుంది. షెడ్యూలింగ్ పొరపాటు కారణంగా ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ అసాధారణ పరిస్థితిని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ గుర్తించారు. అరైవల్, డిపార్చర్‌లో ఉన్న విమానాలకు వెంటనే వేర్వేరు సూచనలు చేశారు. అరైవల్‌లో ఉన్న విమానాన్ని ఎక్కువ ఎత్తు తీసుకోమని, డిపార్చర్‌లో ఉన్న విమానాన్ని తక్కువ ఎత్తులో ప్రయాణించమని సూచించారు. ఆ సూచనకు తగ్గట్టుగానే పైలట్లు తమతమ మార్గాలను మార్చుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తాను 25 ఏళ్లుగా ఈ విధులు నిర్వర్తిస్తున్నానని, ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని కంట్రోలర్ చెప్పారు. అయితే ఈ భద్రతాలోపంపై దర్యాప్తు జరుగుతున్నది.

# అప్పుడు అర్బన్ నక్సల్స్.. ఇప్పుడేమో దిమాగీ నక్సల్స్

**ప్రధాని ఎర్రకోట ప్రసంగంలో ప్రస్తావనపై విమర్శలు**

**మండిపడుతున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 17 :** ప్రధాని నరేంద్రమోడీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట పై నుంచి దిమాగీ నక్సల్స్ అనే వ్యాఖ్యలు చేయడం ప్రతిపక్షాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగంలో ఉపయోగించిన దిమాగీ నక్సల్ పదంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యపై కాంగ్రెస్, సీపీఐ, సమాజ్‌వాదీ తదితర ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. మోదీ గతంలో తన రాజకీయ ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అని పిలిచారని, ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అంటున్నారని విమర్శించారు. ఇది ప్రధాని నిరాశకు సంకేతమని అన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు దిమాగీ నక్సల్స్ అంటే ఎవరో చెబుతూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం వ్యంగ్యంగా స్పందిస్తూ.. తాను 'దిమాగీ నక్సల్స్‌గా ఉండటానికి గర్విస్తున్నారని అన్నారు. రిజిజు ప్రకారం, దిమాగీ నక్సల్స్ అంటే.. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు, ఆర్టికల్ 370కు మద్దతు ఇచ్చేవారు, దేశ ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశం నుంచి వేరు చేయడానికి చికెన్ నెక్‌ను తెంచాలని కోరుకునేవారు అని అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అనే పదంపై సీపీఎం, కాక్రోచ్ జనతా పార్టీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎర్రకోటపై నుంచి జాతిని ఉద్దేశిస్తూ ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. అడవుల్లో ఆయుధాలు పట్టుకుని పోరాడిన నక్సలైట్లను దాదాపుగా అంతం చేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలంతో ఉన్న దిమాగీ నక్సల్స్ఇంకా అవకాశాల కోసం చూస్తున్నారని, హింస, అశాంతికి దారి తీసే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలంటే అలాంటి వారిని గుర్తించి ఏకాకులు చేయాలని మోడీ అన్నారు. ఈ పదాన్ని ఉపయోగించడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ స్పందించారు. ఈ పదాన్ని ప్రభుత్వాన్ని విమర్శించే వారిని, జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టే వారిని ఉద్దేశించి చేశారని ఆయన అన్నారు. గతంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను విమర్శించే వారిని 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేశారని, ఇప్పుడు ఇదే తరహాలో 'దిమాగీ నక్సల్స్' అనే కొత్త పదాన్ని తీసుకువచ్చారని బేబీ అన్నారు. మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నక్సలిజాన్ని అంతం చేశామని చెబుతున్న విధానంపై బేబీ ప్రశ్నలు లేవనెత్తారు. యువకులు, యువతను పట్టుకుని న్యాయపక్రియ ముందు నిలబెట్టే బదులుగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదమని అభివర్ణించారు. వామపక్షాలు నక్సలిజాన్ని ఎప్పుడూ సమర్థించలేదని బేబీ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, దిమాగీ నక్సల్స్ ఇప్పుడు రాజకీయ రచ్చకు దారి తీసింది.



# బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

**ఏడుగురు భక్తుల దుర్మరణం**

**పాట్నా, ఆగస్ట్ 17 :** బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శ్రావణమాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు సత్వర చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి వచ్చారు. దానికి తగ్గట్టే మేం ఏర్పాట్లు చే శాం. భయాందోళన కారణంగా వారు పరిగెత్తడంతో బారికేడ్లు పడి పోయాయి. దాంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనకు ఎలక్ట్రిక్ వైర్ కారణంగా తెలుస్తోంది. ధ్రువీకరించుకున్న తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని లఖిసరాయ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు.

## కళ్యాణలక్ష్మిని నిషేధించే కుట్ర

**భూపాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే ధర్నా**

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్ట్ 17 :** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిషేధించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిషేధించే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మానుకోవాలని అన్నారు.

# ఆటో డ్రైవర్ ఇంట్లో డబ్బుల మూటలు

**ఆయుధాల కోసం వెతికితే పట్టుబడ్డ నగదు**

**3కోట్లుగా స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**భోపాల్, ఆగస్ట్ 17 :** ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో రూ.3 కోట్లు లభ్యమైన ఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్ ఇంట్లో మారణాయుధాలు ఉన్నాయని సమాచారం రావడంతో పోలీసులు సోదా చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నగదు సంచులు కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దాదాపు ఐదు గంటల పాటు శ్రమించి నగదును లెక్కించారు. అనంతరం దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాగర్‌లోని గోపాల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్ రాజేశ్ అహిర్వార్ తన కుటు ంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు సౌరభ్ అహిర్వార్ ఇటీవల సోషల్ మీడియాలో ఓ ఫొటో ను షేర్ చేశాడు. తుపాకీతో దిగిన ఆ ఫొటో స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. అతని వద్ద మారణాయు ధాలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో విష యం పోలీసులకు చేరింది. ఆటో డ్రైవర్ ఇంట్లో ఆయు ధాలు ఉన్నాయన్న కారణంతో వెంటనే దర్యాప్తు ప్రారంభిం చారు. నిందితుడి ఇంటికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఎంత వెతికినా ఆయుధాలు లభించలేదు. అయితే, పెద్దఎత్తున నగదు సంచులు బయటపడ్డాయి. ఆటో డ్రైవర్ ఇంట్లో ఇంత పెద్దమొత్తంలో నగదు కనిపించడంతో పోలీసులు షాక్ అయ్యారు. వెంటనే నగదు లెక్కించే యంత్రాలను తెప్పించారు. సుమారు ఐదు గంటల పాటు శ్రమించి దాని విలువ రూ.3 కోట్లుగా తేల్చి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చిం దని ఆటో డ్రైవర్ కుటుంబాన్ని పోలీసులు ప్రశ్నించారు. అయితే, ఆ డబ్బుతో తమకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. భోపాల్‌లో ప్రభుత్వ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తమ బంధువు కుటుంబ సభ్యులదని వెల్లడించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

**క్షణాల్లో ఏడుగురు మృతి**

**నిద్రలో ఉండగా తెల్లవారుజామున ప్రమాదం**

**కోల్‌కతా, ఆగస్ట్ 17 :** పశ్చిమ బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఓ నాలుగు అంతస్తుల హోటల్ భవనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనం కాగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీ యూనిట్లలో సాంకేతిక లోపం కారణంగా మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు చెలరేగడంతో గ్రౌండ్ మొత్తం క్షణాల్లోనే పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు.. స్థానికులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. ౯÷ర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసి మృతులను, గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, బాధితులంతా ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులుగా తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనపై కోల్‌కతాకు చెందిన ఓ బాధిత మహిళ అతిథి స్పందించారు. హోటల్ మొత్తం పొగతో నిండిపోయిందని, దాని వల్ల చాలా మంది తప్పించుకోలేక పోయారని తెలిపారు. అలాగే, పలువురు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది పడ్డారని వెల్లడించారు. బయటకు వచ్చేందుకు దారీ కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. అలారం కూడా పనిచేయలేదని పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

**హైదరాబాద్,ఆగస్ట్17 :** నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీ మందిర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బీటెక్ విద్యార్థి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడిని 23 ఏళ్ల వికాస్‌గా గుర్తించారు. కాళీ మందిర్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వికాస్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వికాస్ ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదం ఎలా జరిగింది? వాహనం అదుపుతప్పడానికి కారణమేంటి? రహదారి పరిస్థితులు, వేగం తదితర అంశాలు ప్రమాదానికి దారితీశాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మృతుడి తల్లిదండ్రుల నుంచి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.



## కెపీహెచ్‌బిలో అల్లరిమూకల ఆగడాలను అరికట్టాలి : కాంతారావు

**బాధితులను పరామర్శించిన బిజెపి నాయకులు**

**కూకట్‌పల్లి, ఆగస్టు 17, (జనం వార్త) :** కెపిహెచ్ బి కాలనీ ధనలక్ష్మీ సెంటర్ వద్ద గత రెండు రోజుల క్రితం అల్లరి మూకల బారిన పడి గాయాలపాలైన బాధితులను కూకట్ పల్లి నియోజకవర్గ బిజెపి ఇన్ ఛార్జ్, నిజామాబాద్ జిల్లా బిజెపి ఇన్ ఛార్జ్ మాధవరం కాంతారావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెపిహెచ్ బి కాలనీలో అల్లరి మూల దాడులు ఎక్కువ అవుతున్నాయని, మద్యం గంజాయి మత్తులో యువకులు అర్ధరాత్రి దాటితే దారిన పోయే వ్యక్తులపై దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెపిహెచ్ బి కాలనీలో గంజాయి విచ్చల విడిగా అమ్ముడవుతున్న పట్టించుకునే అధికారులే కనిపించడం లేదని ఆరోపించారు. కెపిహెచ్ బి కాలనీ ధనలక్ష్మీ సెంటర్ వద్ద ఇద్దరు యువకులపై దాడులకు పాల్పడిన యువకులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి తోట రమేష్,మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అర్బన్ ఐటి సెల్ కన్వీనర్ నర్వ పవన్ కుమార్,కూకట్ పల్లి నియోజకవర్గం ఓబీసీ మోర్చా కన్వీనర్‌హెవినోద్ గౌడ్, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## హాస్టల్ భవనం నుంచి కిందపడి వ్యక్తి మృతి

**శేరిలింగంపల్లి, ఆగస్టు 17(జనంవార్త):** రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంజయ్యనగర్ కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. హాస్టల్ భవనం పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన కల్లూరి సుబ్బారావు (38) గత కొంతకాలంగా అంజయ్యనగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో హాస్టల్ భవనం పైనుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సంఘటనపై హాస్టల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాయదుర్గం పోలీస్‌స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హాస్టల్ యాజమాన్యంతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. సుబ్బారావు మృతి ప్రమాదవశాత్తూ జరిగిందా, లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హత్య, ఆత్మహత్య కోణాల్లోనూ వివరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తులో వెలుగుచూసే అంశాల ఆధారంగా మృతికి గల పూర్తి కారణాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## శ్రీ కాటమ్మై దేవాలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రం : అనిల్ కుమార్ యాదవ్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 17 (జనంవార్త):** శ్రీ కాటమ్మై దేవాలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందాలని, భవిష్యత్‌లో ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు మరింత మెరుగుపడాలని శ్రీ కాటమ్మై దేవాలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రం అని అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ఖాజాగూడలో తెలంగాణ ఉద్యమకారుడు దివంగత శంకర్ గౌడ్ ఆరాధ్య దైవంగా భావించిన శ్రీ కాటమ్మై దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గణేశ్ గౌడ్ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో అనిల్ కుమార్ యాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల కోసం పనిచేసిన దివంగత శంకర్ గౌడ్‌కు శ్రీ కాటమ్మై అమ్మవారిపై ఎంతో భక్తి, విశ్వాసం ఉండేదని, ఆయన ఆరాధ్య దైవమైన అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ ధర్మకర్త గణేశ్ గౌడ్‌తో పాటు నిర్వాహకులను అభినందించారు. ప్రజల విశ్వాసాలకు, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ధర్మకర్తలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునఃప్రారంభించాలి

**పేదల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది**

**పేదల సంక్షేమ పథకాలను నిలిపివేయడం సరికాదు : మారబోయిన రవి యాదవ్**

**శేరిలింగంపల్లి, ఆగస్టు 17(జనం వార్త):** పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సోమవారం శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆర్‌జీకే కాలనీ ఆటో స్టాండ్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్, శ్రీరామ్‌నగర్ డివిజన్ నాయకులు విజయ్ రెడ్డి తదితరులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేయడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. పేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సంక్షేమ పథకాలను నిలిపివేయడం సరికాదని అన్నారు. పేదల సంక్షేమాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని








పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ప్రయోజనాలు అందించాలని కోరారు. మహిళలకు నెలకు రూ.2,500, వికలాంగులకు రూ.6,000, వృద్ధులకు రూ.4,000 పింఛన్ ఇస్తామన్న హామీలను అమలు చేయాలని రవి యాదవ్ డిమాండ్ చేశారు. అలాగే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా కార్డు వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. పేద ప్రజలకు సంబంధించిన సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని రవి యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## అలియాస్ పేర్ల సమస్య పరిష్కారానికి కమిటీ

- నెల రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం
- కార్మికుల వారసుల దీక్షల విరమణ
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17 :** సింగరేణి సంస్థలో మారుపేర్లతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించేందుకు యాజమాన్యం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ నిర్ణయంతో కార్మికుల వారసులకు న్యాయం జరుగుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట అలియాస్ పేర్ల బాధితులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలను సోమవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సింగరేణి పర్సనల్ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్ బాధితులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పూర్వం కార్మికులు దొరకని రోజుల్లో ఉద్యోగాల్లో చేరినప్పుడు పేర్లలో తప్పులు దొర్లాయని, దీనివల్ల నేడు వారి పిల్లలకు ఉద్యోగాలు రాక తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారన్నారు, తప్పుడు పేర్లు ఉన్నాయని సింగరేణి విజిలెన్సు విభాగం విచారణపేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. విజిలెన్సు విచారణలో ఉండటంతో వారసులకు యాజమాన్యం ఉద్యోగాలు ఇవ్వడంలేదన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం కోల్ బెల్ట్ ఎమ్మెల్యేల సమావేశంలో యాజమాన్యంతో చర్చించామని తెలిపారు. ఫలితంగా ముగ్గురు యాజమాన్య ప్రతినిధులు, ఇద్దరు ఏఐటీయూసీ, ఒకరు ఐఎన్‌టీయూసీ ప్రతినిధులతో కూడిన ఆరుగురు సభ్యుల కమిటీని యాజమాన్యం ఏర్పాటు చేసింద



న్నారు. ఈ కమిటీ నెల రోజుల్లో సమస్యను అధ్యయనం చేసి పరిష్కార మార్గాన్ని చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు నెలరోజుల్లో సమస్యను పరిష్కరించని పక్షంలో కార్మిక వారసుల ఉద్యమ కార్యాచరణ ప్రకటించి పోరాడతామని, ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి పరిస్కారానికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. అలాగే గతంలో వివిధ కారణాలతో డిస్మిస్ అయిన కార్మికుల సమస్యను కూడా యాజమాన్యం మానవతా దృక్పథంతో పరిశీలించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, యూనియన్ నాయకులు వంగ వెంకట్, జి వీరాస్వామి, శేషయ్య, రమణమూర్తి, గట్టయ్య, కిష్టాఫర్, సందెబోయిన శ్రీనివాస్, మాతంగి లింగయ్య, బండారి మల్లయ్య, నర్సయ్య, కార్మికుల వారసులు లక్క శ్రావణ్, ధనాల రాజేందర్, జె రాజేందర్, డిష్ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ రద్దు కుట్రపై బిఆర్ఎస్ పార్టీ సమరశంఖం

**కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17:** తెలంగాణలోని పేద కుటుంబాల ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక ఆసరాగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పోరుబాటకు శ్రీకారం చుట్టింది. పథకాలను ఉద్దేశపూర్వకంగానే మరుగున పడేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ సోమవారం కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు సూచనలతో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ముఖ్య నాయకత్వంలో జరిగిన ఈ ధర్నాలో పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై విరుచుకు పడ్డారు ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రాజ్యాంగ బద్ధతపై దాఖలైన పిటిషన్లలో తెలంగాణ హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో, ప్రభుత్వం అనుసరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి పలుమార్లు గడువు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోకపోవడం వెనుక పథకాల ను శాశ్వతంగా రద్దు చేసే కుట్ర దాగి ఉందని నేతలు విమర్శించారు. ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని పెద్ద పెద్ద హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాన్ని కూడా ఊడదీసే ప్లాన్



చేస్తోందని మండిపడ్డారు. కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన ఈ ధర్నాకు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని కార్పొరేటర్ సాగర్, మాజీ. కౌన్సిలర్ తోగూర్ రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ అంబుల వేణు.కరాటే శ్రీను,సునీత, మాదాస్ పద్మ, అజీమా ఈమంది గణేష్, ఎండి. ఖాజా బక్ష్, పూర్ణ, మునీర్, రిజ్వాన్ పాషా, శివ, షమ్మీ, బాబు, జానీ, అక్బర్, పిల్లి కుమార్, హైమద్, బి శ్రీనివాస్, మనోజ్, వేణు, కనకయ్య, ఖాజా పాషా, అసద్, అమన్, సమీర్, షణ్ముఖ, పాషా, షమ్మీ, సుందర్ పాసి, బీఆర్ఎస్. సీనియర్ నాయకులు, మహిళా నాయకులు. అభిమానులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కళ్యాణలక్ష్మి చెక్కులను వెంటనే విడుదల చేయాలంటూ చేపట్టిన నినాదాలతో ఎంఆర్వో కార్యాలయ ప్రాంగణం హోరెత్తింది. నిరసన అనంతరం వినతిపత్రాన్ని ఎమ్మార్వో డి.పుల్లయ్యకు అందజేశారు.



## బి కేటగిరి సీట్లలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**నవతెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుర్ణగంటి రంజిత్ కుమార్**

**రంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 17 :** ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బి కేటగిరి ( మేనేజ్మెంట్ కోట) సీట్ల కోసం నిర్ణీత ఫీజులకు మించి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారు అనే ఫిర్యాదులపై టీఎస్ సిహెచ్ ఈ వెంటనే విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నవ తెలంగాణ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు సోమవారం నాడు సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేస్తూ పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. టి ఎస్ సి హెచ్‌ఈ చైర్మన్ బాలకృష్ణారెడ్డిని కలిసి విద్యార్థుల సమస్యలను వివరించి వి కేటగిరి సీట్లలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలపై చర్యలు తీసుకోవాలని అలాగే అర్హత ఉన్న విద్యార్థుల పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని నవ తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ విద్యార్థి పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్ణగంటి రంజిత్ కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## హైకోర్టులో కౌంటర్ వెయ్యకుండా ప్రభుత్వం మీనమేషాలు

**బడంగ్ పేట భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు రామిడి రామిరెడ్డి**

**రంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 17:** పేదింటి ఆడబిడ్డల కోసం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ అంశంలో హైకోర్టులో కౌంటర్ వెయ్యకుండా ఆ పథకాల రద్దుకు కాంగ్రెస్ ప్రభుత్వంచేస్తున్న కుట్రను అడ్డుకోవాలని భారత రాష్ట్ర సమితి చేపట్టిన ధర్నాకు విశేష స్పందన లభించిందని బడంగ్ పేట భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు రామిడి రామిరెడ్డి అన్నారు. సోమవారం నాడు బాలాపూర్ మండల కార్యాలయం బడంగ్ పేటలో ఎమ్మార్వో కార్యాలయం ముందు జరిగిన ధర్నాకు ఆయన నేతృత్వం వహించారు. రాష్ట్ర మాజీ ఐటీ శాఖ మంత్రి, కల్వకుంట్ల తారక రామారావు రాష్ట్ర మాజీమంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గ మండల కేంద్రాలలో నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ మాజీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలకు ప్రజలకు చేరువ చేస్తున్న పాత్రికేయులకు ప్రింట్ ఎలక్ట్రానిక్స్ మీడియా వారికి రామిడి రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



## అర్హులైన వారికి అవార్డులు అందజేయడం అభినందనీయం

**మాజీ పార్లమెంట్ సభ్యులు సముద్రాల వేణుగోపాల చారి**

**రంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 17 :** వివిధ రంగాలలో నిష్ణాతులైన వ్యక్తులకు అవార్డులు అందజేయడం అభినందనీయమని మాజీ పార్లమెంట్ సభ్యులు సముద్రాల వేణుగోపాల చారి అన్నారు. ఆదివారం నాడు తెలంగాణ సరస్వత పరిషత్ వేదికగా భావన ఆర్ట్ క్రియేషన్స్ సాంస్కృతిక సంఘ సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 80 స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ఎంతోమంది నిష్ణాతులైన పెద్దలకు అవార్డులు అందజేయడం భావన ఆర్ట్ క్రియేషన్స్కకు దక్కిందని అన్నారు. కళలు సాంప్రదాయాలను గౌరవించడం భారతీయ సాంప్రదాయం అని అన్నారు. గతంలో శ్రీకృష్ణదేవరాయలు రాజ్యాన్ని పాలించిన సందర్భంగా కళాకారులను సన్మానించడం చూసామని ఈ రోజుల్లో కూడా వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి అవార్డులు అందజేయడం అభినందనీయమని అన్నారు ప్రత్యేక అతిథిగా హాజరైన మాజీ చీఫ్ విప్ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్ రుద్రరాజు పద్మరాజు మాట్లాడుతూ అద్భుతమైన కార్యక్రమానికి ఆహ్వానించడం అభినందనీయమని అన్నారు సమాధ్యక్షులు లయన్ డాక్టర్ చిల్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. విశిష్ట అతిథి ఫౌండర్ సముద్రాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సముద్రాల శ్రీదేవి మాట్లాడుతూ కళలను కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు భావన ఆర్ట్స్ క్రియేషన్స్ అధ్యక్షులు ఏ రవికాంత్ వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది ఈ కార్యక్రమంలో ఇంకా విశ్రాంత ప్రధానాచార్యులు చందు ఆంజనేయులు, ఆత్మీయ అతిథి డాక్టర్ కేవీపీ వసంత రాయలు రాజేంద్ర కుమార్ పొన్న అనురాధ కొత్తవర్ మరో ఆత్మీయ అతిథిగా సంతోష్ నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లదిగ శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొనగా, వివిధ రంగాలలో నిష్ణాతులైన వ్యక్తులకి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి సేవలు నిరంతరాయం పనిచేస్తూ ఆయనకే తన జీవితాన్ని అంకితం ఇచ్చిన సంతోష్ నగర్ దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లదిగ శ్రీనివాసాచార్యులకు మాజీ మంత్రివర్యులు పార్లమెంటు సభ్యులు సముద్రాల వేణుగోపాల చారి, రుద్రరాజు పద్మరాజు, డాక్టర్ చిల్ల రాజశేఖర్ రెడ్డి డాక్టర్ సముద్రాల శ్రీదేవి ఆధ్వర్యంలో అర్చక పురస్కారం అందించి ఘన సన్మానం చేశారు.

# ఎన్‌టీఏ తప్పులకు విద్యార్థుల మూల్యం

**సోషియాలజీ, ఇంగ్లీష్ పరీక్షల రద్దు దారుణం**

**మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షలో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. ఎన్‌టీఏ తప్పులకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు. ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. 'మోదీజీ.. మీ ఎన్‌టీఏ ఏం చేసిందో చూడండి. జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షా వ్యవస్థ విద్యార్థులను దోపిడీ చేసే వ్యవస్థగా మారిందని రాహుల్ ఆరోపించారు. దేశంలో సరైన పరీక్షా వ్యవస్థ లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశా రు. తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ఇదే విషయాన్ని ప్ర స్తావించానన్నారు. 'ఇది విద్యా వ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మారింది' అని రాహుల్ విమర్శలు గుప్పించారు. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాలు పరీక్షకు ముందే లీకయ్యాయా? అని రాహుల్ గాంధీ సందేహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు ఎన్‌టీఏ ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారాయన. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనన్న రాహుల్ గాంధీ.. ఎన్‌టీఏ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయ ను న్న ప్రతి విద్యార్థికి చెబుతున్నా.. మీరు సమస్య కాదు. పరీక్షను నిర్వ హించలేని వ్యవస్థను ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్మించింది. ఆ వ్యవస్థ చేసిన తప్పులకు ఇప్పుడు విద్యార్థులనే బాధ్యులుగా చేస్తోంది. మీ విలువైన సంవత్సరాలు వృథా అవుతున్నాయి. దీనిపై మోదీ సమాధా నం చెప్పే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటాం' అని అన్నారు.

## సుప్రీంలో రాహుల్‌కు ఊరట

**ఆదాయిని మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత**

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.



## బీహార్ ఆలయ తొక్కిసలాట ఘటన

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 17:** బిహార్ లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతికి గురయ్యారు. తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు చేశారు. బిహార్‌లోని లఖిసరాయ్‌లో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసింది. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయం అందిస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు, బాధితులకు బిహార్ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదం గురించిన వివరాలను లఖిసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు. శ్రావణ మాసం సందర్భంగా జలాభిషేకం చేసేందుకు వేలాది మంది భక్తులు అశోక్ ధామ్ ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. దర్శనం కోసం మహిళలు, పురుషులు రెండు క్యూ లైన్లలో నిలబడి ఉండగా.. పురుషుల క్యూ లైన్‌కు సమీపంలో విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయిందన్నారు. స్తంభానికి ఉన్నది కేబుల్ వైర్ అయినప్పటికీ.. విద్యుత్ వైర్ అనే పుకారు క్షణాల్లో వ్యాపించిందని పేర్కొన్నారు. దీంతో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. రెండు నిమిషాల వ్యవధిలో ఏడుగురు మృతి చెందగా.. దాదాపు 12 మందికి పైగా గాయపడినట్లు జిల్లా మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం సదర్ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. మృతులు, గాయపడిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

## టీవీకే మంత్రుల అవినీతి బాగోతం

**లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న అన్నామలై**

**చెన్నై, ఆగస్టు 17:** తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రభుత్వంపై మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ టెండర్లు దక్కించుకునే కాంట్రాక్టర్ల నుంచి కొందరు మంత్రులు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అన్నామలై తాజా వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి. చెన్నైలో నిర్వహించిన పర్యావరణ అవగాహన కార్యక్రమంలో అన్నామలై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి విజయ్ అవినీతికి వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరితో ఉన్నారని, కానీ కొందరు మంత్రుల వ్యవహారశైలి అందుకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు. గతంలో కీలక టెండర్ల విషయంలో కమిషన్ల డిమాండ్లు లేవని, ఇప్పుడు కొందరు మంత్రులు కాంట్రాక్టర్ల నుంచి వాటాలు అడుగుతున్నారని విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో తాము డబ్బులు ఖర్చు చేశామని చెబుతూ.. కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నామలై ఆరోపించారు. రెండు శాతం ఇవ్వాలని, మూడు శాతం ఇవ్వాలని, అవసరమైతే నాలుగు శాతం ఇవ్వాలని అడుగుతున్నట్లుగా ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని అన్నారు. సందర్భంగా మంత్రులు, ఉన్నతాధికారులపై ముఖ్యమంత్రి విజయ్ మరింత నిఘా పెట్టాలని అన్నామలై సూచించారు. ప్రభుత్వం అవినీతి రహిత పాలనను లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు, కిందిస్థాయిలో జరుగుతున్న అక్రమాలపైనా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, విజయ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే అవినీతి ఆరోపణలు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

**ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,ఆగస్ట్17:** భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి తొలి ఇండిగో విమానం భోగాపురం విమానాశ్రయానికి చేరుకుందన్నారు. తొలి విమానం రాకతో ఏపీ.. కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం.. రాష్ట్రంలో కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. యువత ఆశలు, ఆకాంక్షలకు ఈ విమానాశ్రయం రెక్కలు తొడుగుతుందని.. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలకు మరింత ఊతమిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్టు కీలకంగా మారనుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చరిత్రాత్మక కొత్త ఆరంభమని.. ఉత్తరాంధ్రకు కొత్త గేట్‌వేగా అవతరించనుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఏపీ కొత్త శకానికి నాంది పలికిందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## మంత్రుల సరదా సంభాషణ

**మంత్రి సత్యకుమార్‌పై లోకేశ్ సెటైర్లు**

**అమరావతి, ఆగస్ట్ 17:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల ప్రారంభంలో మంత్రుల మధ్య జరిగిన సరదా సంభాషణ ఆసక్తికరంగా మారింది. ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ యాదవ్ కమలం పార్టీ కండువాతో శాసనసభలోకి వచ్చారు. ఈ క్రమంలో ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సరదాగా స్పందించారు. 'సత్యగారూ.. మీకెందుకండి ప్రత్యేకంగా పార్టీ కండువా? మీరు బీజేపీ అని లోకమంతా తెలుసు కదా!' అంటూ సరదాగా లోకేశ్ చమత్కరించారు. లోకేశ్ వ్యాఖ్యలకు సీనియర్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కూడా సరదాగా జత కలిశారు. 'అవును సర్.. జాతీయ స్థాయిలో ప్రముఖ నేతల్లో సత్యగారు కూడా ఒకరు' అంటూ సత్యకుమార్‌ను ప్రశంసించా రు. దీంతో అక్కడి వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. నంతరం లోకేశ్ మరోసారి సత్యకుమార్‌ను చమత్కరించారు. 'మా పార్టీ వారికి కూడా క్రమశిక్షణ గురించి నేర్పిం చండి' అంటూ సత్యకుమార్‌ను ఉద్దేశించి లోకేశ్ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సమయంలో పక్కనే ఉన్న టీడీపీ ఎమ్మెల్యే ఒకరు 'పార్టీ ఫస్ట్, సర్!' అని స్పందించారు. దీనికి సత్యకుమార్ యాదవ్ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. 'నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్ట్స్.. సెల్ఫ్ లాస్ట్!' అని ఆయన పేర్కొన్నారు.

## 50 ఏళ్లలో గ్రూప్-1 లాంటి స్కామ్ చూడలే

**అసెంబ్లీలో దీనిపై చర్చిస్తాం : సిఎం నారా చంద్రబాబునాయుడు**



**అమరావతి, ఆగస్ట్ 17:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి తప్పిదాన్ని చూడలేదన్నారు. సోమవారం ఏపీ అసెంబ్లీ లాబీల్లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సీఎం చిట్‌చాట్ చేశారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో గ్రూప్ -1 లాంటి స్కాం చూడలేదని వ్యాఖ్యానించారు. ఆ కుంభకోణంలో ఎంతోమంది మెరిట్ విద్యార్థులు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అసెంబ్లీలో చర్చిస్తామని అన్నారు. బుధవారం సభలో అన్ని విషయాలు చర్చిస్తామని సీఎం పేర్కొన్నారు. డీఎస్సీలో మహిళా టీచర్లు ఎక్కువమంది ఉన్నారని ప్రస్తావించారు. ఆదివారం విజయవాడలో ఉపాధ్యాయులు నిర్వహించిన ఆందోళనలో వారు బాగా మాట్లాడారని తెలిపారు. ఆత్మాభిమానంతోనే ఆత్మగౌరవం కాపాడుకునేందుకు అంతమంది టీచర్లు వచ్చారని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని వైసీపీ నేతలు దెబ్బతీస్తోండటంతో సహించలేక రోడ్డు ఎక్కారని చెప్పారు. మహిళా టీచర్లకు డీఎస్సీతో, ఆ పక్రియతో ఓ ఎమోషనల్ బాండింగ్ ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## విద్యార్థులను కలవండి.. చర్చించండి

**జార్ఖండ్ సిఎం సోరెన్‌కు రాహుల్ లేఖ**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 17:** జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను స్వయంగా కలిసి వారి సమస్యలను వినాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కోరారు. ఈ మేరకు ఆగస్టు 14న సోరెన్‌కు రాహుల్ గాంధీ లేఖ రాశారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీక్, నియామక పక్రియలో పారదర్శకత లోపించిందంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. రాంచీలో కొనసాగుతున్న ఈ నిరసనలు సోమవారం నాటికి 24వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థుల ఆందోళన ఇప్పటివరకు శాంతియుతంగానే సాగుతోందని, వారి డిమాండ్లు న్యాయమైనవని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు.గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. జార్ఖండ్‌లోని పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా చూడటానికి ముఖ్యమంత్రి స్వయంగా విద్యార్థులను కలిసి వారి ఆందోళనలను వినాలి. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి' అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు.

- **నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్ లైన్‌లోనే**
- **డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు**
- **ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెన్జీలతో ఫేక్ ప్రదర్శనలు**
- **ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపికి సవాల్**
- **శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం**



**అమరావతి, ఆగస్టు 17:** మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 10-12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు. "అని ముఖ్యమంత్రి అన్నారు.

### డీఎస్సీ నియామక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే

"గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పీలేట్ అథారిటీనీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్ లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. డీఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో ,90 ఏళ్ల జగన్ జెన్ జీ వ్యక్తులతో ధర్నాలు చేయించింది. ఈ ఆరోపణల్ని ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారు. మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో పెద్ద ఎత్తున టీచర్లు ఆందోళన చేశారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ నాగబాబు

**ఉత్తర్వులు జారీచేసిన ఏపీ ప్రభుత్వం**

**అమరావతి, ఆగస్ట్ 17:** ఏపీ గ్రీనింగ్, 'రీఫారెస్టేషన్' (పునరటవీకరణ) కార్యక్రమాల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్టీ నంబర్ -93 ద్వారా ఈ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం, అడవుల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ఆయా కార్యక్రమాలను అమలు చేయనుంది. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణంలో ఫారెస్ట్, ట్రీ కవర్‌ను 2047 నాటికి 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ఏపీ సర్కార్ చర్యలు చేపడుతోంది. ఏపీ గ్రీన్ గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీ, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల పాలక మండళ్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర గ్రీన్ లక్ష్యాల అమలు, సమన్వ యం, పర్యవేక్షణలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్ కీలక పాత్ర పోషించనున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కొణిదెల నాగేంద్రబాబును నియమించిన ఏపీ సర్కార్.. ఆయనకు కేబినెట్ హోదా కల్పించింది. ఈ ని బంధనలకు లోబడి కేబినెట్ ర్యాంక్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీన్, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల కార్యకలాపాల సమర్థవంతంగా అమలు చేయాలని ఈ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది.

# నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయం గా నెలకొన్న అనిశ్చితుల వేళ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో సెన్సెక్స్ వరుసగా రెండో సెషన్‌లో నష్టాలు చవిచూడగా.. నిఫ్టీ ఐదో రోజూ నష్టాల్లో ముగి సింది. ఇంట్రాడే కనిష్ఠాల నుంచి సూచీలు కోలుకోవడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 77,892.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,009.25) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్ట ల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 77,453.75 వద్ద కనిష్ఠానికి పడిపోయిన సూచీ... చివరికి 281.09 పాయింట్ల పతనమై 77,728. 16 వద్ద ముగిసింది. నిఫ్టీ 78.35 పాయింట్లు కోల్పోయి 24,287.65 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.61గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటాస్టీల్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, బజాజ్‌ఫైనాన్స్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగతా కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.54 డాలర్ల వద్ద కొనసాగు తోంది. బంగారం ఔన్సు 4,394.13 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## స్మార్ట్‌ఫోన్ ధరలు మరింత పైకి

'మరికొన్ని రోజులు ఆగితే ఆఫర్లు మొదలవుతాయ్.. అప్పుడు డిస్కౌంట్‌లో మంచి ఫోన్ కొందాంలే' అని వేచి చూస్తున్న టెక్ ప్రియులకు చేదువార్త. మొబైల్ కంపెనీలు మరోసారి తమ స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేశాయి. కనీసం రూ.2 వేల నుంచి గరిష్ఠంగా రూ.10వేల వరకు ధరల పెంపు చేపట్టాయి. ధరలు సవరించిన జాబితాలో వన్‌ప్లస్, పోకో, రెడ్‌మీ, ఐకూ కంపెనీలు ఉన్నాయి. మెమొరీ చిప్‌ల ధరల పెరుగుదలను కారణంగా చూపుతూ ఆయా కంపెనీలు.. ఇది వరకే ధరలు పలుమార్లు ధరలు సవరించడం గమనార్హం. దీంతో సామాన్యుడికి తక్కువ బడ్జెట్‌లో ఫోన్ దొరకడం గగనంగా మారింది. ప్రముఖ స్మార్ట్‌ఫోన్ కంపెనీ వన్‌ప్లస్ తన నార్డ్ 6 సిరీస్ వేరియంట్ ధరలను పెంచేసింది. నార్డ్ 6, నార్డ్ సీఈ 6, నార్డ్ సీఈ6 లైట్‌తో పాటు కొత్తగా లాంచ్ చేసిన ఎన్6 ఎక్స్, ఎన్6 స్మార్ట్‌ఫోన్లపై గరిష్ఠంగా రూ.4 వేల వరకు ధరల పెంపు చేపట్టింది. వివో అనుబంధ సంస్థ ఐకూ కూడా 15 సిరీస్ ధరలను సవరించింది. ఐకూ 15 ధరను రూ.8 వేల వరకు, ఐకూ 15పై రూ.5 వేల వరకు, ఐకూ నియో 10 సిరీస్ ధరలను రూ.2 వేల వరకు పెంచింది. షావోమి అనుబంధ పోకో కూడా తన ఫోన్ల ధరలను పెంచింది. పోకో ఎక్స్8 ప్రో, ప్రో మాక్స్ వేరియంట్ల ధరలను గరిష్ఠంగా రూ.5 వేల వరకు పెంచేసింది. రెడ్‌మీ కూడా తన టర్బో 5 స్మార్ట్‌ఫోన్‌పై రూ.5వేలు పెంచింది. ఒప్పో కూడా కే13 టర్బో ప్రో వేరియంట్‌పై రూ.5 వేల వరకు ధరలను సవరించింది. వివో తన వై సిరీస్ ధరలను సవరించింది.

# భారత్‌కు భారీ ఆధిక్యం!

- శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌట్
- సోనాల్ దినుషా సెంచరీ.. రాణించిన నిరోషన్ డిక్‌వెల్లా
- నాలుగు వికెట్లతో అదరగొట్టిన బౌలర్ మానవ్ సుతార్
- భారీగా వర్షం రావడంతో ముగిసిన మూడో రోజు ఆట..




శ్రీలంకతో తొలి టెస్ట్‌లో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు కుప్పకూలింది. సోనాల్ దినుషా(100) సెంచరీతో చెలరేగగా.. నిరోషన్ డిక్‌వెల్లా(115 బంతుల్లో 7 ఫోర్లతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(4/76) నాలుగు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(3/57) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 460/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు కుప్పకూలింది. దేవదత్ పడిక్కల్(230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 167) సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్(175 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు తీయగా.. కేశర నువాంత(3/175) మూడు వికెట్లు పడగొట్టాడు. అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు షాకిచ్చారు. సిరాజ్, జడేజా, మానవ్ సుతార్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దాంతో శ్రీలంక 99/5 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. తొలి సెషన్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. రెండో సెషన్‌లో సొనాల్ దినుషా, నిరోషణ్ డిక్‌వెల్లా శ్రీలంకను ఆదుకున్నారు. అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో నిరోషన్ డిక్‌వెల్లా 67 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. దినుషా 92 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. దాంతో శ్రీలంక 215/5 స్కోర్ టీ బ్రేక్‌కు వెళ్లింది. దినుషా, డిక్‌వెల్ల అద్భుత బ్యాటింగ్‌తో రెండో సెషన్‌లో శ్రీలంకనే పైచేయి సాధించింది. ఆఖరి సెషన్‌లో భారత బౌలర్లు జూలు విధిల్చారు. 146 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. సెంచరీ దిశగా సాగిన నిరోషన్ డిక్‌వెల్లా(80)ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో మ్యాచ్ భారత్‌వైపు మలుపు తిరిగింది. ఆ వెంటనే కేశర నువాంత(2)ను జడేజా ఔట్ చేయగా.. ప్రబాత్ జయసూర్య(10)ను మానవ్ సుతార్ వెనక్కిపంపాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు సోనాల్ దినూషా.. 167 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ మరుసటి బంతికే అతన్ని జడేజా ఎల్బీగా పెవిలియన్ మార్చాడు. లాహిరు కుమార(10)ను మానవ్ సుతార్ ఔట్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ వెంటనే వర్షం రావడంతో అంపైర్లు మూడో రోజు ఆటను ముగించారు. నాలుగో రోజు ఆటలో భారత్ తొలి సెషన్‌లోనే 130 పరుగులు చేసి శ్రీలంక ముందు 300 ప్లస్ రన్స్ లక్ష్యాన్ని నమోదు చేయాలి. అప్పుడే ఈ మ్యాచ్ భారత్ వశమవుతోంది. వర్షం అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో చాలా తెలివిగా ఆడాల్సిన అవసరం ఉంది.



## రూల్స్ పాటించని విమానాలు నిలిపివేయండి : సుప్రీం

విమాన ఛార్జీల పెరుగుదల అంశంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రద్దీగా ఉండే సమయాల్లో విమాన ఛార్జీలు అడ్డూ అదుపూ లేకుండా పెరగడాన్ని తప్పుపట్టింది. ఛార్జీల విషయంలో ప్రభుత్వ ఆదేశాలను పాటించని విమానయాన సంస్థల సేవలను నిలిపివేయాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. విమాన ఛార్జీల అసాధారణ పెరుగుదలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. విమాన టికెట్ ధరల్లో భారీ హెచ్చుతగ్గులు, విమానయాన సంస్థలు విధిస్తున్న అదనపు ఛార్జీలపై సామాజిక కార్యకర్త ఎస్.లక్ష్మీనారాయణన్ పిటిషన్ దాఖలు చేశారు. రద్దీ వేళ ఈ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై తాజాగా సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. విమానయాన సంస్థలు ప్రస్తుత నిబంధనలను కూడా సక్రమంగా పాటించడం లేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అలాంటి విమానాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇదే అంశంపై గత విచారణ సందర్భంగా 'భారతీయ వాయుయాన్ అధినియం, 2024' చట్టం కింద రూపొందించిన కొత్త నిబంధనలను రెండు వారాల్లో సీల్డ్ కవర్‌లో సమర్పించాలని కేంద్రానికి సూచించింది. ఈ నేపథ్యలో కేంద్రం తరఫున విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ కౌశిక్.. నిబంధనల రూపకల్పన తుది దశకు చేరినట్లు కోర్టుకు తెలి యజేశారు. విమాన ఛార్జీలు, సర్జ్ ప్రైసింగ్, అధిక లగేజీకి సంబంధించిన తుది నిబంధనలను మూడు వారాల్లోగా తెలియజేస్తామని పేర్కొన్నారు. దీనికి అంగీకరించిన ధర్మాసనం.. తదుపరి విచారణను సెప్టెంబర్ 7కు వాయిదా వేసింది.



## శ్రీలంకతో తొలి టెస్టు..

### అరుదైన క్లబ్‌లో రవీంద్ర జడేజా

టీమ్ఇండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టుల్లో మరో రికార్డు అందుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు 350 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేశర నువాంతను ఔట్ చేసి ఈ ఘనత అందుకున్నాడు. 2012లో టెస్టు క్రికెట్ అరంగేట్రం చేసిన జడేజా.. తన 90వ మ్యాచ్‌లో 350 వికెట్ల క్లబ్‌లో చేరాడు. దీంతో భారత్ తరఫున 350 కంటే ఎక్కువ వికెట్లు తీసిన ఐదో భారత బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. అనిల్ కుంబ్లే (619 వికెట్లు), అశ్విన్ (537), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417) ఈ జాబితాలో ఉన్నారు. అంతేకాకుండా టెస్టు క్రికెట్ చరిత్రలో 4 వేలకుపైగా పరుగులు, 350 వికెట్లు పడగొట్టిన నాలుగో ప్లేయర్‌గా జడేజా ఘనత సాధించాడు. ఈ జాబితాలో కపిల్ దేవ్ (5248 పరుగులు, 434 వికెట్లు) అగ్రస్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ డానియల్ వెటోరి (4531 రన్స్, 362), ఇంగ్లాండ్ మాజీ పేస్‌ఆల్‌రౌండర్ ఇయాన్ బోథమ్ (5200 పరుగులు, 383 వికెట్లు) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

### పి.వి.సింధు శుభారంభం



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు శుభారంభం చేశారు. దిల్లీ వేదికగా ఇవాళ మొదలైన ఈ టోర్నీలో స్టార్ షట్లర్ పి.వి.సింధు తొలి రౌండ్‌లో సూపర్ విక్టరీ సాధించింది. మహిళల సింగిల్స్ రౌండ్ 64లో సింధు 21–7, 21–11 తేడాతో సోఫియా నోబెల్ (ఐర్లాండ్)ను మట్టికరిపించింది. తొమ్మిదో సీడ్ అయిన సింధు.. తొలి గేమ్‌ను సునాయాసంగా సొంతం చేసుకుంది. ప్రపంచ 141వ ర్యాంకు ప్లేయర్ అయిన సోఫియా రెండో గేమ్‌లో పోరాడింది. ఒక దశలో 10–8 నిలిచి ఆధిక్యంలోకి వెళ్లేలా కనిపించింది. కానీ, తర్వాత సింధు పుంజుకుని వరుసగా పాయింట్లు సాధించి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

### ప్రపంచ నంబర్ వన్‌కు షాక్ ఇచ్చిన ఆయుష్ శెట్టి

ఇక, తొలిసారి బీడబ్ల్యూఎఫ్ ఛాంపియన్‌షిప్‌లో ఆడుతున్న భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి సంచలనం సృష్టించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్ షి యుకి (చైనా)ని ఆయుష్ కంగుతినిపించాడు. 21 ఏళ్ల ఈ కర్ణాటక కుర్రాడు 21–14, 13–21, 21–9 తేడాతో షి యుకిపై విజయం సాధించాడు. అంతకుముందు మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్–ట్రీసా జాలీ జంట తొలి రౌండ్‌లో విజయం సాధించి రౌండ్ 32కు దూసుకెళ్లింది. ఈ జోడీ వరుస గేమ్‌ల్లో 21–9, 21–13 తేడాతో పౌలా–లూసియా (స్పెయిన్)ని చిత్తు చేసింది. పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్–హరిహరన్ జంట కూడా తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. స్కాట్–రేమాండ్స్ (ఐర్లాండ్) జంటతో జరిగిన తొలి రౌండ్‌లో అర్జున్ ద్వయం తొలి గేమ్‌ను 21–16తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో భారత జోడీ 1–0 ఆధిక్యంలో ఉండగా ఐరిష్ ద్వయం రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగింది. దీంతో అర్జున్–హరిహరన్ జంట ముందంజ వేసింది.




## చిన్న పన్ను చెల్లింపుదార్లకు విదేశీ ఆస్తుల వెల్లడి పథకం అమల్లోకి..

చిన్న పన్ను చెల్లింపుదార్లు 60 శాతం పన్ను చెల్లించి, తమ వెల్లడిచేయని కొన్ని విదేశీ ఆస్తులు, ఆదాయ వివరాలను ప్రకటించడానికి అనుమతించే ఒక కొత్త స్వచ్ఛంద వెల్లడి పథకాన్ని ఆదాయపు పన్ను విభాగం నోటిఫై చేసింది. అర్హులైన పన్ను చెల్లింపుదార్లను అదనపు జరిమానాలు లేదా ప్రాసిక్యూషన్‌కు గురి చేయకుండా, వారి విదేశీ ఆస్తులను పన్ను పరిధిలోకి తీసుకొని రావాలన్నదే దీని వెనక ప్రభుత్వ ఉద్దేశం. బడ్జెట్లో ప్రకటించిన చిన్న పన్ను చెల్లింపుదార్ల విదేశీ ఆస్తుల వెల్లడి పథకం (ఫాస్ట్- డీఎస్) ఆగస్టు 16 నుంచి (నేడు) అమల్లోకి వచ్చిందని, ఆన్‌లైన్ డిక్లరేషన్‌ల సదు–పాయం 2026 డిసెంబరు 31 వరకు అందుబాటులో ఉంటుందని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది. ఎవరికంటే..: విదేశీ ఆస్తులు, ఆదాయాలను వెల్లడించడంలో విఫలమైన విద్యార్థులు, యువ వృత్తి నిపుణులు, టెక్నాలజీ ఉద్యోగులు, భారత్‌కు తిరిగొచ్చిన ప్రవాసులే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. పన్ను చెల్లింపుదార్లు ఏదైతే వెల్లడించని విదేశీ ఆస్తి లేదా ఆదాయాన్ని ప్రకటించారో, ఆ ఆస్తి లేదా ఆదాయ విలువపై 30 శాతం పన్నుతో పాటు, దానికి సమానమైన అదనపు మొత్తాన్ని చెల్లించాలి. అంటే మొత్తం పన్ను 60 శాతానికి చేరుతుందన్నమాట. ఆస్తుల సహేతుక మార్కెట్ విలువను 2026 మార్చి 31 నాటికి ఉన్న దాని ప్రకారం నిర్ధారిస్తామని సీబీడీటీ తెలిపింది. నిర్దిష్ట పన్ను లేదా రుసుము చెల్లించడం ద్వారా పన్ను చెల్లింపుదార్లు తదుపరి పన్ను లేదా జరిమానా నుంచి, బ్లాక్ మనీ (వెల్లడించని విదేశీ ఆదాయం, ఆస్తులు), పన్ను విధింపు చట్టం- 2015 కింద చేపట్టే విచారణ నుంచి మినహాయింపు పొందుతారని వెల్లడించింది.




## ఓటీటీలో 'జన నాయగన్'.. స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్

తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్'. హెచ్.వినోద్ దర్శకుడు. పూజా హెగ్డే, మమిత బైజు, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషించారు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ విజయ్ అభిమానులను అలరించింది. సెన్సార్ సమస్యల కారణంగా జనవరి నుంచి వాయిదా పడుతూ వచ్చిన ఈ మూవీ ఎట్టకేలకు జులై 23న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలైన సంగతి తెలిసిందే. నెల రోజులు తిరగక ముందే ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. జీ5 వేదికగా ఆగస్టు 21వ తేదీ నుంచి తమిళ్‌తో పాటు, తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. జీ5 ఈ విషయాన్ని తెలియజేస్తూ వీడియోను పంచుకుంది. మరోవైపు ఇప్పటివరకూ ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.

## పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న
# విశ్వనాథ్ అండ్ సన్స్



సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.

## గోగితా చిక్వాడ్జే దర్శకత్వంలో..
# వారణాసి మేకింగ్ వీడియో

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్‌పై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్‌పై ఓ ఇంట్రెస్టింగ్ విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమౌళితో పాటు మరో దర్శకుడు కూడా 'వారణాసి' ప్రాజెక్ట్‌లో భాగమయ్యారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన ప్రధాన సినిమాకు దర్శకత్వం వహించడం లేదు. 'వారణాసి' ఎలా రూపుదిద్దుకుంటోంది? రాజమౌళి టీమ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరయ్యారు? భారీ సెట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా తెరకెక్కుతున్నాయి? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందించే బాధ్యతను ఆయన తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగితా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు సమాచారం. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ పక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి అనేక కీలక అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ-ప్రొడక్షన్‌లో ఆయన చేసే ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ స్థాయిలో విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి విషయాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది. రాజమౌళి సినిమాల మేకింగ్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. 'బాహుబలి' చిత్రానికి సంబంధించిన మేకింగ్ కంటెంట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే 'ఆర్ఆర్ఆర్'కు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు కూడా సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో



'వారణాసి' మేకింగ్ డాక్యుమెంటరీని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. సినిమా వెనుక ఉన్న అసలు శ్రమను, రాజమౌళి విజన్‌ను, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్న విధానాన్ని ఇందులో చూపించనున్నట్లు సమాచారం. 'వారణాసి' కేవలం భారతీయ మార్కెట్‌ను మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సినిమా కావడంతో.. మేకింగ్ డాక్యుమెంటరీకి కూడా గ్లోబల్ స్థాయిలో మంచి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు టాక్. సినిమా డిజిటల్ హక్కులతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీని కూడా ప్యాకేజీలో భాగంగా చేసే ఆలోచనపై చర్చలు జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## రాముడి సుగుణాలు కనిపించాలంటే రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే : యశ్



కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు.



## చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా
# బాబీ సినిమా

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివే శాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది.



## డిసి ఆద్యంతం
# అద్భుతంగా ఉంది
### నటుడు మహేశ్ బాబు రివ్యూ

లోకేశ్ కనగరాజ్, వామికా గబ్బి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'డీసీ' ఇటీవల విడుదలైన ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా స్టార్ హీరో మహేశ్ బాబు 'డీసీ' చిత్రా నికి శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా తన రివ్యూ ఇచ్చారు. చాలా వినూత్నమైన, అద్భుతమైన చిత్రం. చాలా బాగుంది. ప్రతి అంశం నచ్చింది. ఈ సినిమా కోసం వర్క్ చేసిన వారందరికీ అభినందనలని పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌ను దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ రీషేర్ చేస్తూ మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'మీ పోస్ట్ నిజంగా చాలా సంతోషాన్నిచ్చింది. మీరు డీసీని చూడటం, దీన్ని అభినందించడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది. మీ ప్రేమకు, కామెంట్స్‌కు ధన్యవాదాలు' అని రిప్లై ఇచ్చారు. దర్శకుడిగా తనదైన ముద్రవేసిన లోకేశ్ కనగరాజ్‌లో నటుడు కూడా ఉన్నారు. పలు చిత్రాల్లో ఆయన తళుక్కున మెరిశారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమే 'డీసీ'. ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. 'డీసీ' చూశాను. సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని తప్పకుండా చూడాలి. చిత్రబృందానికి అభినందనలు. దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ చాలా గొప్పగా తీశారు. అనిరుధ్ నిజంగా అద్భుతం చేశారు. లోకేశ్ కనగరాజ్ హీరో పాత్రలో ఒదిగిపోయారని అల్లు అర్జున్ ప్రశంసించారు.

## దిగ్గజ దర్శకులతో పని చేయాలని ఉంది : అనన్య పాండే



బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ అనన్య పాండే అతి తక్కువ సమయంలోనే వైవిధ్యమైన పాత్రలో నటించి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. అయితే ఈ మూవీ బాక్సాఫీసు వద్ద ఆశించినంత స్థాయిలో రాణించకపో వడంతో కొంత గ్యాప్ తీసుకున్నారు. ఈనేపథ్యంలోనే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన హాట్ ఫొటోలు షేర్ చేస్తున్న అనన్య పాండే తాజాగా ఒక ఇంటర్వ్యూలో భాగం గా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సోషల్ మీడియాలో వ్యాపించే నెగెటివిటీ, ట్రోలింగ్‌తో సతమతమయ్యే వారికి ఆమె ఒక మంచి సలహా ఇచ్చారు. ఆన్‌లైన్ నెగెటివిటీని చూసి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. మనపై నెగెటివిటీ లేదా ట్రోలింగ్ వచ్చినప్పుడు కాస్త ప్రశాంతంగా వెనక్కి తగ్గి ఆలోచిస్తే, ఈ పరిస్థితి కేవలం మన ఒక్కరికే కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరికీ ఎదురవుతోందని అర్థమవుతుందని అన్నారు. సమాజంలో ఎంతో విజయవంతంగా, అత్యంత ఆత్మవిశ్వాసం తో కనిపించే వ్యక్తులు కూడా ఇలాంటి ఆన్‌లైన్ విమర్శలను ఎదుర్కొంటున్నారని గ్రహిస్తే, దానికి ఉండే శక్తి, భయం పూర్తిగా తగ్గిపోతాయని అనన్య వివరించారు. ఇక చిత్రపరిశ్రమలో తాను ఇప్పటివరకు కలిసి పనిచేయని కొందరు దిగ్గజ దర్శకులతో పనిచేయాలని ఉందని తన కోరికను బయటపెట్టారు. బాలీవుడ్ ప్రముఖ దర్శకులు కరణ్ జోహార్, జోయా అక్తర్, సంజయ్ లీల భన్సాలీలతో పనిచేయడం తన డ్రీమ్ లిస్ట్‌లో ఉందని వెల్లడించారు. ఈ ముగ్గురు అగ్ర దర్శకుల దర్శకత్వంలో నటించే అవకాశం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు అనన్య స్పష్టం చేశారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com